క్లుప్తంగా

ఏయూ యోగా జట్టు ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఆచార్య విజయమోహన్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ పురుషులు, మహిళల యోగా జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏయూ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్, వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా యూనివర్సిటీ యోగా పోటీలు భువనేశ్వర్‌లోని కిట్స్ యూనివర్సిటీలో ఈ నెల 24 నుంచి 28 వరకు జరుగుతాయన్నారు. వివిధ ఆసనాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను విజయమోహన్, ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి అభినందించి యోగాలో ప్రతిభ సాధించి వర్సిటీకి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. యోగా కోచ్ వర్మ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో వాకర్లకు పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వీఎస్‌సీ వాకర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. వీఎస్‌సీ వాకర్స్ అసోసియేషన్‌కు చెందిన 40 మంది సభ్యులు వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సాయిచంద్‌తో కూడిన వైద్యుల బృందం బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించింది. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పి.కిషోర్‌కుమార్, డాక్టర్ పప్పూర్ నికుంజ్, జాలీ వాకర్ తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ విశాఖ వ్యాలీ అధ్యక్షుడిగా రామకృష్ణ



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కొంకిపూడి రామకృష్ణ తదితరులు

బీచ్‌రోడ్డు: జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్(జేసీఐ) విశాఖ వ్యాలీ నూతన అధ్యక్షుడిగా కొంకిపూడి రామకృష్ణ నియమితుడయ్యారు. నగరంలోని లయన్స్ క్లబ్‌లో ఆదివారం ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. జోనల్ ప్రెసిడెంట్ ఎ.సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవీ స్వీకరణ అనంతరం ఈ ఏడాది జేసీఐ ఆధ్వర్యంలో చేపట్టబోయే పలు అంశాలపై రామకృష్ణ మీడియాతో మాట్లాడారు. ముఖ్యంగా అన్ని రంగాల వారికి సేవలందించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అందుకు తగ్గట్టు సేవా కార్యక్రమాలకు పెద్దపీట వేసేందుకు మిగతా సభ్యులతో కలిసి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కాలేజీ విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఫర్ యూత్ పేరిట కార్యక్రమాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణ అందిస్తామన్నారు. యోగా, వైద్య శిబిరాలు, డ్రగ్స్ నియంత్రణపై అవగాహన, మహిళలకు వివిధ అంశాలపై శిక్షణ, స్వచ్ఛ భారత్.. ఇలా అన్ని వర్గాలకూ అవసరమైన సేవలందిస్తామని వివరించారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షుడు గతేడాది చేసిన కార్యక్రమాల వివరాలను సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో కె.వి.రావు, కె.పి.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన నిర్మాణం



నిర్మాణం లోపలి భాగం

- విమ్స్ ఆవరణలో సా...గుతున్న సిటీ డయాగ్నిస్టిక్ సెంటర్ పనులు
- నేటికీ పూర్తి కాని భవనం
- అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులు



విమ్స్ ఆవరణలో నిర్మిస్తున్న సిటీ సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ భవనం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో సిటీ డయాగ్నిస్టిక్ సెంటర్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ భవన నిర్మాణం తూతూ మంత్రంగా జరుగుతోంది. పనులు ప్రారంభించిన ఏడాదిన్నరలో నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలనే ప్రతిపాదనకు అధికారులు నీళ్లొదిలారు. మూడేళ్లు గడిచినా ఇంతవరకు భవన నిర్మాణం పూర్తికాక పోవడం విశేషం. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ తీరును బట్టి ఇది వినియోగంలోకి రావడానికి ఇంకెంతకాలం పడుతుందో అనేది ప్రశ్నార్థకంగా మారింది. నగరంలో పేద, మధ్యతరగతి రోగులకు ఉచితంగా రక్త పరీక్షలు, స్కానింగ్ చేయించాలనే గత ప్రభుత్వం ఆలోచనలకు ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అధికారులు బ్రేక్ వేస్తున్నారు.

పడకేసిన పనులు

హనుమంతవాక దరి విమ్స్ ఆవరణలో బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు ద్వారం సమీపంలో సుమారు అరెకరం స్థలాన్ని సిటీ డయాగ్నిస్టిక్ సెంటర్ కోసం 2021లో కేటాయించారు. దానిలో ఈ భవన నిర్మాణం జరుగుతోంది. దీని కోసం రూ.20 కోట్లు నిధులు కేటాయించారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించారు. ఒకటిన్నరేళ్లలో దీని నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అప్పట్లో అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. కొన్నాళ్ల పాటు పనులు చకచకా జరిపించారు. అనంతరం మధ్యలో కొంతకాలం పనులు నిలిపేశారు. 2023 నుంచి మళ్లీ పనులు ప్రారంభించి శరవేగంతో కొనసాగించారు. 2024 మార్చి నుంచి సాధారణ ఎన్నికల హడావుడి పేరుతో అధికారులు సెంటర్ నిర్మాణ పనులను పక్కన పెట్టేశారు. అప్పటికే భవన నిర్మాణం పూర్తయింది. లోపల ఫ్లోరింగ్, విద్యుత్ వైరింగ్ పనులు, ల్యాబ్‌కు అవసరైన పరికరాల ఏర్పాటు, సీలింగ్ తదితర పనులు నత్తనడకన చేసుకుపోతున్నారు. దీంతో మరికొన్నాళ్లు గడిచినా దీని పనులు పూర్తికాని పరిస్థితి నెలకొంది.



భవనం లోపల పరీక్షల గది

నిర్మాణం పూర్తయితే ప్రజలకు మేలు

సిటీ డయాగ్నిస్టిక్ సెంటర్ భవన నిర్మాణం పూర్తయితే నగరవాసులకు మేలు జరుగుతుంది. నగరంలో ఎక్కడి వారైనా రోగులకు ఈ సెంటర్‌లో ఉచితంగా రక్త పరీక్షలు, స్కానింగ్ తీయనున్నారు. ప్రస్తుతం చిన్నపాటి జ్వరానికి వైద్యులు వివిధ రక్త పరీక్షలు, స్కానింగ్‌లు చేయించాలని రిఫర్ చేస్తున్నారు. వాటిని చేయడానికి రోగులకు రూ.వేలల్లో ఖర్చు అవుతోంది. ఈ సెంటర్ వినియోగంలోకి వస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా రక్త పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో పేద, మధ్యతరగతి రోగులకు ఆర్థిక భారం తగ్గుతుంది. అధికారులు దృష్టి సారించి వేగవంతంగా పనులు పూర్తి చేయించి, సెంటర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ముస్తఫా కాలనీలో పశు వధ

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు ముస్తఫా కాలనీలో నివాసాల మధ్య పశు వధ విచ్చలవిడిగా సాగుతోంది. ఇక్కడ పశు మాంసం వ్యాపారులు ఎక్కువగా ఉన్నారు. సుమారు 8 షాపులు వరకు ఉన్నాయి. వ్యాపారం చేసుకోవడానికి జీవీఎంసీ వెటర్నరీ విభాగం నుంచి కొన్ని నిబంధనలు ఉన్నాయి. వాటిని వ్యాపారులు పాటించకుండా ఇక్కడే విచ్చలవిడిగా గోవధ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం పశు మాంసం వ్యాపారులు గోవులను మారికవలస వద్ద ఓజోన్ వ్యాలీలో ఉన్న కబేలా(స్లాటర్ హౌస్) వద్ద ఏటలు వేయించాలి. ఆ పశువు ఏట వేసే సమయానికి ఆరోగ్యంగా ఉన్నట్లు అక్కడ వెటర్నరీ వైద్యాధికారి సర్టిఫికెట్ ఇచ్చి దానిపై ముద్ర వేయాలి. అలా కాకుండా నిబంధనలు ఉల్లంఘించి ముస్తఫా కాలనీలో పశు మాంసం వ్యాపారులు మాత్రం నివాసాల మధ్యనే అనధికారికంగా ఏటలు వేసేస్తున్నారు. ఆదివారం ఓ వ్యాపారి వ్యానులో కొన్ని గోవులను తీసుకొచ్చి హింసాయుతంగా కిందకు దించాడు. ఆవులకు తాళ్లు కట్టి వ్యాను పైనుంచి ఒక్కొక్కటిగా కిందకు లాగేసి వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వధించే శాలలోకి తీసుకెళ్లారు. ఇలా నిత్యం ఇక్కడ కొందరు వ్యాపారులది ఇదే తీరు. నివాసాల మధ్య వధిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాటిని వధిస్తున్న సమయంలో గోవులు గొట్టిగా అరవడం, వాటి రక్తం కాలువల్లో ప్రవహిస్తూ దుర్వాసన రావడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. నిత్యం ఇదే తీరున జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వ్యాపారులు నేరుగా ఇక్కడే పశువులను వధించడంపై స్థానికులు తప్పుపడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ముస్తఫా కాలనీలో వ్యాను నుంచి ఆవును లాగేసి కిందవేసిన పశు మాంసం వ్యాపారి

అనధికార పశు వధశాల నిర్వాహకుడి అరెస్ట్

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో అనధికారికంగా పశు వధశాల నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని ఆరిలోవ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ముస్తఫా కాలనీలో పశు మాంస వ్యాపారి ఇబ్రహీం అనధికారికంగా పశు వధశాల నిర్వహిస్తున్నాడు. అందులో ఆదివారం దూడలను వధిస్తుండగా.. స్థానికులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించి వెంటనే వ్యాపారి నిర్వహించే పశు వధశాలకు చేరుకున్నారు. అక్కడ దూడను ఏట వేసిన సమయంలో ఇబ్రహీంను అదుపులోకి తీసుకున్నారు. నిబంధనలు మీరి అనధికారికంగా వధ శాల నిర్వహించి ఏటలు వేయడంతో ఇబ్రహీంను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో విశాఖ యువకుడి ప్రతిభ



గోపీచంద్

ఏయూక్యాంపస్: జాతీయ స్థాయిలో నిర్వహించిన బాడీబిల్డింగ్ పోటీల్లో నగరానికి చెందిన దమ్ము గోపీచంద్ ప్రతిభ చూపాడు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన మిస్టర్ ఇండియా బాడీబిల్డింగ్ పోటీల్లో నాలుగో స్థానం నిలిచాడు. ప్రస్తుతం గోపీచంద్ తన తండ్రి దమ్ము శ్రీనివాసరావు వద్ద శిక్షణ పొందుతున్నాడు. కొద్ది రోజుల కిందట ఏయూలో జరిగిన బాడీబిల్డింగ్ పోటీల్లో ఈ యువకుడు బంగారు పతకం సాధించాడు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా గోపీచంద్ తెలిపాడు.

ఆర్టీసీ ఉద్యోగుల గ్రాట్యూటీ మంజూరుకు కృషి



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎన్‌ఎంయూఏ రాష్ట్ర నాయకులు

మద్దిలపాలెం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతోపాటు గ్రాట్యూటీ మంజూరుకు కృషి చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్ కోరారు. విశాఖ డిపోలో ఆదివారం జరిగిన ఆర్టీసీ కొత్త బస్సుల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథి రాష్ట్ర యువజన క్రీడా, రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితోపాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, జోనల్ చైర్మన్ దొన్ను దొర, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లను విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు నైట్ ఔట్ అలవెన్స్‌లు, పరిమితి లేని గ్రాట్యుటీ కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అమలు చేయిస్తున్నందుకు గానూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.సురేష్ నాయుడు, రీజినల్ అధ్యక్ష కార్యదర్శులు బి.నీలకంఠం గండి రామకృష్ణ, జిల్లా చైర్మన్ ప్రాస్ డివిజన్ కార్యదర్శి ఎ.కె.శివాజీ, గాజువాక అధ్యక్ష, కార్యదర్శులు పి.శంకరరావు, నీలకంఠం, వాల్తేర్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.వసంతరావు, పి.జి.పతి, సింహాచలం, స్టీల్ సిటీ కార్యదర్శులు జె.ఎస్.ఎన్.రాజు, సాయిరాం, మద్దిలపాలెం అధ్యక్ష, కార్యదర్శులు చిన్నా, ఎం.ఈశ్వరరావు అన్ని డిపోల కమిటీల కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆచార్య హరినాథ్

విశాఖ విద్య: మత్తు పదార్థాలకు బానిసైతే యువత జీవితం నాశనమవుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలల చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.హరినాథ్ అన్నారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఆదివారం శాతవాహన హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూను డ్రగ్స్ రహిత క్యాంపస్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఉన్నత ఆశయాలతో విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉంటూ, ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా నిరంతరం శ్రమించాలన్నారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్‌కు బానిసలుగా మారకూడదని హితవు పలికారు. వాటి వల్ల ఆరోగ్యం, భవిష్యత్తు నాశనమవుతాయని గుర్తించాలన్నారు. విద్యావంతులైన యువత దేశానికి ఉపయుక్తంగా నిలిచే ఉన్నత మానవ వనరులుగా మారాలని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన బ్యానర్‌లను ప్రదర్శిస్తూ విద్యార్థుల్లో అవగాహన కల్పించారు.

ఆధ్యాత్మికత చాటిన సుశీలాజీ ప్రవచనాలు



ప్రవచిస్తున్న సుశీలాజీ



ముగింపు కార్యక్రమానికి హాజరైన నగరవాసులు

విశాఖ విద్య: వేదాంత ఇన్‌స్టిట్యూట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఐదు రోజుల పాటు భగవద్గీత 10వ అధ్యాయం 'విభూతియోగం'పై ఇంగ్లిష్‌లో నిర్వహించిన జ్ఞాన యజ్ఞం(ప్రవచనాల కార్యక్రమం) ఆదివారంతో ముగిసింది. ఆఖరి రోజు స్వామి పార్థసారథి శిష్యురాలు సుశీలాజీ ప్రవచనాలు వినేందుకు నగరవాసులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వీరి కోసం ఆడిటోరియంలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సుశీలాజీ ప్రవచిస్తూ మానవులు అతి ఆవశ్యకమైన ఆత్మచింతనను వదిలి అనవసరపు ప్రాపంచిక విషయాలపై తమ దృష్టిని నిలుపుతున్నారన్నారు. ఈ అధ్యాయంలో శ్రీకృష్ణుడు మానవుల ఆత్మ గురించిన పరిమితి ఆలోచనల నుంచి, సర్వవ్యాప్తి, సర్వధారి, సర్వశక్తి మంతమైనదని తెలియ చెప్పడానికి ప్రయత్నించారని వివరించారు. సకల మానవాళి ఆత్మసాక్షాత్కారం లక్ష్యంగా అడుగులు వేయాలని సుశీలాజీ తన ప్రవచనాలను ముగించారు. ముందుగా భజన కీర్తనలు ఆలపించారు. స్వామీ పార్థసారథి వివిధ అంశాలపై రచించిన పుస్తకాలను ప్రదర్శించారు. ప్రవచనాల అనంతరం అందరికీ గురు ప్రసాదం పంచిపెట్టారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీవీపీ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ పి.సోమరాజు హాజరయ్యారు. వేదాంత ఇన్‌స్టిట్యూట్ ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు, నగరవాసులు పాల్గొన్నారు.

భళా.. విద్యార్థుల చిత్రకళ

ఆకట్టుకుంటున్న ఫైన్ ఆర్ట్స్ ఫెయిర్



విద్యార్థులకు సూచనలిస్తున్న ఏయూ ఆచార్యుడు



కళారూపాలను తిలకిస్తున్న విద్యార్థులు



చూడచక్కని పెయింటింగ్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం విద్యార్థులు తమ కళా ప్రతిభతో నగరవాసుల మనసులను దోచుకుంటున్నారు. ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల చిత్రకళా ప్రదర్శనకు కళాభిమానులు, నగరవాసుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ సంవత్సరం విద్యార్థులు తమ ప్రతిభతో తయారు చేసిన చిత్రాలను ప్రదర్శించడంతోపాటు వాటి విక్రయాలను సైతం ఏర్పాటు చేశారు. ఈ కళాఖండాలను నగరవాసులు ఎంతో ముచ్చటపడి కొనుగోలు చేస్తున్నారు. నాణ్యమైన కళారూపాలు తక్కువ ధరకే ఇక్కడ లభిస్తూ ఉండటంతో నగరవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శని, ఆదివారాల్లో విక్రయాలు గణనీయంగా జరిగాయి. దీంతో విద్యార్థులు మరికొన్ని చిత్రాలు, శిల్పాలను తయారు చేసే పనిలో నిమగ్నమవుతున్నారు. ఇంట్లో అలంకరణకు, బహుమతులుగా ఇవ్వడానికి విద్యార్థులు చేసిన కళాఖండాలు, వర్ణ చిత్రాలు ఎంతో అనువుగా ఉంటున్నాయి. దీంతో పెద్ద సంఖ్యలో నగరవాసులు వచ్చి వీటిని తిలకించి తమకు నచ్చిన వాటిని కొని తీసుకెళ్తున్నారు. ఈ నెల 29 వరకు చిత్రకళా ప్రదర్శన కొనసాగుతుందని, ఉదయం 10 నుంచి సాయంత్రం 7 వరకు శివాజీపాలెంలోని ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఈ ప్రదర్శన ఉంటుందని విభాగాధిపతి డి.సింహాచలం తెలిపారు.



కళారూపాలను తిలకిస్తున్న విద్యార్థులు





ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు తయారు చేసిన వివిధ ఆకృతులు

బాలికల అక్రమ రవాణాపై నివేదిక అందించండి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా అనుమానాస్పదంగా వేరే ప్రాంతాలకు తీసుకెళ్తున్న 9 మంది మైనర్ బాలికలను ఇటీవల రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యవహారంలో పూర్తి వివరాలతో నివేదిక అందించాలని రైల్వే పోలీసులకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఆదివారం ఓ ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. పిల్లలను అక్రమంగా రవాణా చేస్తున్నారా..?, ఉపాధి పనుల నిమిత్తమా..? అన్న విషయంపై, అలాగే సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లు ఆలస్యంగా కేసు నమోదు చేశారా? లేక వెంటనే నమోదు చేశారా? సంబంధిత అంశాలతో నివేదిక అందజేయాలని కోరారు. నివేదిక ఆధారంగా కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫార్సులు చేయనున్నట్లు సీతారాం తెలిపారు.


25న 'బుట్టబొమ్మ' షోరూం ప్రారంభం



మాట్లాడుతున్న బొమ్మన బ్రదర్స్ అధినేతలు

మద్దిలపాలెం: వస్త్ర వ్యాపార రంగంలో 93 ఏళ్ల అనుభవమున్న బొమ్మన సంస్థ మగువల మనసు దోచే బుట్టబొమ్మ షోరూంను ఈ నెల 25న విశాఖలోని మద్దిలపాలెంలో ప్రారంభించనున్నట్లు సంస్థ అధినేత బొమ్మన సత్యరాజ్‌కుమార్ తెలిపారు. బొమ్మనాస్ 'బుట్టబొమ్మ' పేరిట క్రిస్మస్ రోజున అందరికీ అందుబాటులోకి నూతన షోరూంను తీసుకొస్తున్నామన్నారు. మద్దిలపాలెం షోరూంలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికుల నుంచి నేరుగా చీరలు కొని సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చేరువ చేసేందుకే కొత్తది ప్రారంభిస్తున్నామని చెప్పారు. బుట్టబొమ్మ షోరూం అధినేత బొమ్మన మణిరాజ్‌కుమార్ మాట్లాడుతూ మన సంప్రదాయానికి తగ్గట్టుగా, నేటి యువతరం మెచ్చే డిజైన్లతో గద్వాల్, కంచి, నార్త్ నుంచి సౌత్ వరకు అన్ని రకాల వస్త్రాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. బొమ్మన బ్రదర్స్ అధినేత బొమ్మన యువరాజ్ కుమార్ మాట్లాడుతూ తనకు రాష్ట్రవ్యాప్తంగా 15 షోరూంలున్నాయని, విశాఖలో గాజువాక, జగదాంబ, బీచ్ రోడ్డుతోపాటు మద్దిలపాలెంతో కలిపి నాలుగు శాఖలవుతాయన్నారు. మద్దిలపాలెం ఇంటర్ బోర్డు కార్యాలయం ఎదురుగా ప్రారంభించనున్న బుట్టబొమ్మ షోరూంలో వివిధ రకాల చేనేత వస్త్రాలు, మగువలు మెచ్చే అన్ని రకాల చీరలు లభ్యమవుతాయని తెలిపారు.

ఉన్నతంగా ఉద్యోగ నిర్వహణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కమలాకర్, సమాఖ్య నాయకులు, నాన్ టీచింగ్ స్టాఫ్

విశాఖ విద్య: ఉద్యోగ బాధ్యతలు ఉన్నతంగా నిర్వహించాలని రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కె.కమలాకర్ సూచించారు. సమాఖ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ కాలేజీలకు చెందిన నాన్ టీచింగ్ ఉద్యోగులకు కార్యాలయ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కమలాకర్ కార్యాలయ నిర్వహణ ఏ విధంగా నిర్వహించాలనే అంశంపై శిక్షణ ఇచ్చారు. పదేళ్ల కిందట తయారు చేసిన వెబ్‌నోడ్స్‌ను సందర్శించి, విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. కళాశాలలో విద్యార్థులకు కార్యాలయాల ద్వారా చేయాల్సిన ప్రజా సేవ, ఉద్యోగులకు అందించాల్సిన బాధ్యతల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను సమాఖ్య నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు జీవీ అప్పారావు, కార్యదర్శి బండారు సుధాకర్, బంకపల్లి రామారావు, జిల్లా మాజీ అధ్యక్షులు కె.రాజేశ్వరరావు, సిహెచ్.నాగేశ్వరరావు, చిన్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో తాగుబోతుల వీరంగం

మహారాణిపేట: కేజీహెచ్‌లో తాగుబోతులు వీరంగం సృష్టిస్తున్నారు. సిబ్బందికి సంబంధించిన కొందరు వ్యక్తులు అనధికారికంగా విధులు నిర్వర్తిస్తూ రోగులను, వారి బంధువులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. శనివారం రాత్రి ముగ్గురు వ్యక్తులు మద్యం తాగి ఆక్సిజన్ ట్యాంక్ పైపులను కత్తిరించడానికి ప్రయత్నించారు. ఇది గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై విచారణ చేపడుతున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. ఒకవేళ పైపులు కట్ చేసి ఉంటే ఆస్పత్రికి ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయేది. వీరు రోగులు, వారి బంధువుల నుంచి పర్సులు, సెల్‌ఫోన్లు, ఆభరణాలతో పాటు ఆస్పత్రి ఆస్తులను కూడా దొంగిలిస్తున్నారు. బైక్‌లను కూడా దొంగలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కానీ.. కేజీహెచ్ అధికారులు కానీ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.